
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
గురువారం 20 ఫిబ్రవరి 2025



జనం పలకలేదు

కేటగిరీల వారీగా ఇలా..

- సూర్యఘర్ పథకంలో 50 శాతం రాయితీ
- కరెంటు బిల్లుల్లో ఆదా
- అయినా జనం స్పందన అంతంత మాత్రమే



ఇంటిపై అమర్చిన సోలార్ పలకలు

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో కరెంటు బిల్లులు అడ్డగోలుగా పెంచేశారు. ట్రూఅప్ చార్జీల పేరిట జనాన్ని మోదేశారు. ఇంకా వచ్చే ఏడాది వరకు ట్రూఅప్ చార్జీల భారం మోయాల్సిన పరిస్థితి దాపురించింది. కరెంటు ముట్టుకుంటే కాదు.. కరెంటు బిల్లులు పట్టుకుంటేనే షాక్ కొట్టేలా తయారైంది. జనాలకు కరెంటు బిల్లుల భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోంది. ఎండతోనే విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. యూనిట్ కాస్ట్‌కు ప్రభుత్వం 50శాతం సబ్సిడీ ఇస్తుంది. ఇది ఏర్పాటు చేసుకుంటే కరెంటు బిల్లులు గణనీయంగా ఆదా చేసుకోవచ్చు. ఇంత మంచి అవకాశాన్ని జిల్లా వాసులు వినియోగించుకోలేకపోతున్నారు. సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావడంలేదు. జిల్లాలో 6,72,580గృహ విద్యుత్ సర్వీసులు ఉంటే ఇప్పటి వరకు 3,967 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. దీన్ని బట్టి చూస్తే కనీసం విద్యుత్ కనెక్షన్లలో ఐదో వంతు కూడా నమోదు చేసుకోకపోవడం గమనార్హం.

మూడు శ్లాబుల్లో

కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దీనిని మూడు శ్లాబులుగా నిర్ణయించింది. కేంద్రమిచ్చే సబ్సిడీతో పాటు బ్యాంకు నుంచి రుణం ఇప్పించే ఏర్పాటు చేసింది. ఒక కిలో వాట్‌కు రూ.30వేలు, 2 కిలోవాట్లకు రూ.60వేలు, 3 కిలోవాట్లకు రూ.78వేలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. ఇంటి పైకప్పుపై కనీసం వంద చదరపు అడుగుల స్థలంలో 1కే సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి ప్రత్యేక మీటరును కూడా అమరుస్తారు. సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తు మీటరు రీడింగ్‌లో కనిపిస్తుంది.

అరకొర స్పందన

ఎండలు ఎక్కువ కావడంతో సోలార్ ఉత్పత్తికి మన జిల్లా అనుకూలమైనది. అందుకే ఇక్కడ సోలార్ ప్రాజెక్టులు ఎక్కువ వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వమే యూనిట్ కాస్ట్‌లో సగం సబ్సిడీ ఇవ్వడం, మిగతా సొమ్ము బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పిస్తోంది. అయినప్పటికీ ఈ పథకానికి స్పందన అంతంతగానే ఉంది. జిల్లాలో 6,72,580 గృహ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఇప్పటి వరకు 3,967మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 505 ఇళ్లపై అమర్చారు. ఎస్సీ ఎస్టీ వారికి ఉచితంగా ప్రభుత్వం అమరుస్తుంది. జిల్లాలో ఎస్సీ ఎస్టీ సర్వీసులు 72,270 ఉన్నాయి. సోలార్ ప్యానెల్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను వాడుకోగా మిగిలిన విద్యుత్‌కు యూనిట్‌కు రూ.2.03ను లబ్ధిదారునికి ప్రభుత్వం చెల్లిస్తుంది.



- ఓ కిలో వాట్ సామర్థ్యంతో సోలార్ రూఫ్‌టాప్ వేసుకుంటే నెలకు 120 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. దీని ద్వారా ప్రస్తుతం నెలకు వచ్చే రూ.1,000 కరెంటు బిల్లు కాకుండా.. రూ.338 మాత్రమే బిల్లు వస్తుంది. అంటే ఏడాదికి రూ.8వేలు ఆదా అవుతుంది.
- 2 కిలోవాట్లు ఏర్పాటు చేసుకుంటే నెలకు 240 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. నెలకు రూ.2వేలు విద్యుత్ బిల్లు వచ్చే వారికి రూ.333కు పరిమితమవుతుంది. అంటే ఏడాదికి రూ.20వేలు ఆదా అవుతుంది.
- 3 కిలోవాట్లకు 360 యూనిట్ల ఉత్పత్తి వస్తుంది. రూ.3 వేలు వచ్చే కరెంటు బిల్లు రూ.290కి పరిమితమవుతుంది. అంటే సంవత్సరానికి రూ.32,400 ఆదా అవుతుంది.

పెట్టుబడి నాలుగేళ్లలో వెనక్కి..



ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ఒక గొప్ప అవకాశం. సోలార్ ప్లాంటులో పెట్టిన డబ్బు నాలుగైదేళ్లలోనే వెనక్కి వస్తుంది. పెట్టుబడి ఎక్కువ అనిపిస్తున్నప్పటికీ కరెంటు ఉత్పత్తి వల్ల బిల్లులు ఆదా అయి మనం పెట్టిన డబ్బు వెనక్కి వస్తుంది. అలాగే ఈ సూర్య పలకలవల్ల వాతావరణ కాలుష్యానికి కారణమైన కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చు. జిల్లావాసులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాకు టార్గెట్ ఏమీ లేదు. ఎంతమంది అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. - రమణ, ఎస్ఈ, ట్రాన్స్‌కో

రుణజాతర



కడప కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఇంటర్వ్యూలకు హాజరైన వారితో జనసంద్రంగా మారిన దృశ్యం

- జిల్లా వ్యాప్తంగా 1,863 యూనిట్లు
- 22వేలకు పైగా దరఖాస్తులు
- సంక్షేమ రుణాల కోసం బారులు తీరిన అభ్యర్థులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కల్పన కోసం బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ కులాల కార్పొరేషన్లు అందిస్తున్న సబ్సిడీ రుణాల కోసం వేలాదిగా జనాలు తరలివచ్చారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమ రుణాల కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వెనుకబడిన తరగతులకే కాకుండా కమ్మ, కాపు కులాల్ల అర్హులకు రుణాలు అందించేందుకు యూనిట్లు మంజూరు చేశారు. దీనితో జిల్లా వ్యాప్తంగా 1863 యూనిట్లకు గాను 22వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. కడప నగరంలో 370 యూనిట్లకు 5158 దరఖాస్తులు అందాయి. సబ్సిడీ రుణాల మంజూరుకోసం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల బుధవారం ఇంటర్వ్యూలు జరిగాయి. కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలకు వేలాదిమంది హాజరయ్యారు. దీనితో కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో ఎటుచూసినా జనాలు కిక్కిరిసిపోయి జాతరను తలపించింది. బ్యాంకు, ఏరియా వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి పత్రాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల అధికారులు, మున్సిపల్ అధికారులు, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ తదితరులు పాల్గొన్నారు. సీఐ రామకృష్ణ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రిమ్స్‌లో అత్యాధునిక పరికరం



వైద్య పరికరం పనితీరును పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పల్మనరీ మెడిసిన్ విభాగంలో రూ.20లక్షల ఖరీదైన నూతన బ్రాంకో స్కోప్ పరికరాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి బుధవారం ప్రారంభించారు. ఈ పరికరంతో వివిధ మందులతో తగ్గని దగ్గు, ఆయాసము, నెమ్ము లక్షణాలు కలిగిన వాళ్ల రోగనిర్ధారణకు, ఊపిరితిత్తుల గాలిగొట్టాల్లో ఉన్న మ్యూకస్ ఫారిన్‌బాడీ మొదలైన వాటిని తొలగించేందుకు ఉపయోగించవచ్చని పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ నూకరాజు తెలిపారు.

రామాయణంలో వైజ్ఞానిక అంశాలు

- డాక్టర్ మేడసాని మోహన్

కడప కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రామాయణంలో సామాజిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక అంశాలు ఉన్నాయని పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. వైవీయూ ఆధ్వర్యంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'తెలుగులో రామాయణాలు సామాజిక దృక్పథం' అనే అంశంపై జరుగుతున్న రెండురోజుల అంతర్జాతీయ సదస్సులో భాగంగా బుధవారం సాయంత్రం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి చిత్రించిన రాముడు గురువులకు గురువని, ఆచరణశీలుడని అన్నారు. ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ రెండురోజుల సదస్సు ద్వారా రామాయణానికి చెందిన అనేక పరిశోధనాంశాలు వెలుగులోకి వచ్చాయన్నారు. వైవీయూ తెలుగు శాఖ అధ్యాపకులు ఆచార్య టి.రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల సదస్సును విశ్లేషిస్తూ లోటుపాట్లను భర్తీ చేసేలా తదుపరి భవిష్యత్తులో నిర్వహించేలా కార్యాచరణ ఉంటుందన్నారు. హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆచార్య డి.విజయలక్ష్మి మాట్లాడుతూ రామాయణంలోని శాస్త్ర, సాంకేతిక విషయాలను పలు ఉదాహరణలతో వివరించారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వఅధ్యక్షులు ఆచార్య దామోదర్‌నాయుడు సమాపన సందేశమిస్తూ రామాయణాన్ని సామాజిక సాంస్కృతిక, ఆధ్యాత్మిక, చారిత్రక కోణాల్లో చూడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథరెడ్డి, సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సీపీ బ్రౌన్ బాషా పరిశోధనకేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తదితరులు ప్రసంగించారు. ఈ సదస్సులో 80 మంది దేశ విదేశాల ప్రతినిధులు, పత్ర సమర్పకులు వివిధ అంశాలపై ప్రసంగించారు. సీపీ బ్రౌన్ భాషా పరిశక్షధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలక్రిష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి సభను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైవీయూ తెలుగుశాఖ అధ్యక్షురాలు ఆచార్య ఎంఎం వినోదిని, అధ్యాపకులు రమాదేవి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సజ్జల ఎస్టేట్‌లో నేటి నుంచి సర్వే

- ఆర్డీవో నేతృత్వంలో ప్రత్యేక టీం ఏర్పాటు

(కడప-ఆంధ్రజ్యోతి): సీకేదిన్నె మండలంలో వైసీపీ నేత, ప్రభుత్వ మాజీ సలహాదారుడు సజ్జల రామక్రిష్ణారెడ్డి సోదరుడు అటవీశాఖ భూములను ఆక్రమించారనే ఆరోపణలపై గురువారం కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, సర్వే ఆఫ్‌ల్యాండ్ ఏడీ, డీఎఫ్ఓ నేతృత్వంలో ప్రత్యేక బృందం మరోసారి సర్వే చేపట్టనుంది. సీకేదిన్నె మండలంలో సజ్జల కుటుంబానికి వివిధ సర్వే నెంబర్ల పేరిట 184.32 ఎకరాల భూమి ఉంది. వీటికి ఆనుకుని ఉన్న 52.40 ఎకరాల రిజర్వు ఫారెస్టు భూములను ఆక్రమించి పండ్లతోటలు నాటారు. ఈ విషయాన్ని ఇటీవల ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. ఇప్పటికే దీనిపై రెవెన్యూ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. 52.40 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు అంచనాకు వచ్చారు. దీనిపై సజ్జల కుటుంబం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అటవీశాఖ భూముల ఆక్రమణ నిగ్గు తేల్చుతామంటూ ఇప్పటికే డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ నేపథ్యంలో గురువారం మరోసారి సర్వే చేయనున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

జగన్‌కు మతిభ్రమించింది

- పారదర్శకంగా పాలన సాగిస్తుంటే బెదిరింపులా?
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మతి భ్రమించిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం తన నివాసంలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవితో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఐపీఎస్ అధికారులను ఇష్టానుసారంగా వినియోగించుకున్నారని, ఆయన చెప్పిన మాట విని తప్పులు చేసినందుకు ఆ అధికారులు ఇప్పుడు చిక్కుల్లో పడ్డారన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులతో మీరు తప్పులు చేయిస్తే.. ఇప్పుడు ప్రభుత్వం తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకోవడం తప్పా అని ప్రశ్నించారు. ఈ రోజు నిక్కచ్చిగా తమ విధులు నిర్వహిస్తున్న పోలీసులను బట్టలూడదీస్తామంటూ మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రికి రాజ్యాంగం పట్ల ఎంత మాత్రం గౌరవం ఉందనేది స్పష్టం అవుతుందన్నారు. మహానాడు నిర్వహణ కోసం కడపలో సాక్షి సర్కిల్, జయరాజ్ గార్డెన్, సెంట్రల్ జైలు వద్ద స్థలాల పరిశీలన జరుగుతోందన్నారు.

అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి చీడపురుగులాంటివాడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రిమాండ్ ఖైదీని పరామర్శించేందుకు వెళ్లిన ఆయన మాట్లాడిన మాటలు వాడిన భాషను చూసి ఆ సొంత పార్టీ నాయకులే అసహ్యించుకుంటున్నారన్నారు. ఒక ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి మాట్లాడాల్సిన మాటలు కావన్నారు. ఒక ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి కులాలు, అందము గురించి మాట్లాడడం సరికాదన్నారు. పులివెందుల ఎమ్మెల్యేగా జగన్ అనర్హుడని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని 190 (4) ప్రకారం ఏ సభ్యుడైనా స్పీకర్ అనుమతి లేకుండా 60 రోజుల పాటు సమావేశాలకు గైర్హాజరు కాకూడదన్నారు. దీని ప్రకారమే మధ్యప్రదేశ్‌లో ఒక శాసనసభ్యుడు అనర్హుడు కాగా.. దేశంలో మొత్తం నలుగురిపై ఇదివరకు అనర్హత వేటు వేశారన్నారు. గతంలో ఇద్దరు సీఎంలు ప్రాతినిధ్యం వహించిన పులివెందులలో నేటికి తాగునీటి సమస్య ఉందన్నారు. పాడా పేరుతో జరిగిన నిధుల అక్రమాలపై విజిలెన్స్ ఎంక్వైరీ జరుగుతుందని తిన్నదంతా కక్కిస్తామన్నారు.

భూముల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల రీ సర్వే వేగవంతంగా, పకడ్బందీగా నిర్వహించి నివేదికలు సమర్పించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. బుధవారం విజయవాడ నుంచి భూముల రీసర్వే అదనపు సీసీఎల్ఏ ఎన్.ప్రభాకర్ రెడ్డితో కలసి సీసీఎల్ఏ కమిషనర్ జి.జయలక్ష్మి అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సీసీఎల్ఏ కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో భూముల రీ సర్వేపై ప్రత్యేక శ్రద్ధ వహించి నివేదికలు పంపాలన్నారు. నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. భూముల రీసర్వేలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్‌లో జేసీ సంబంధిత అధికారులతో మాట్లాడారు. పౌర సేవలు సంతృప్తి స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. రెవెన్యూ శాఖలో ఎక్కడా పెండింగ్ అంశాలు ఉండకూడదన్నారు. జిల్లాలో భూముల రీసర్వే వేగవంతంగా నిర్వహించి నివేదికలు సమర్పించాలన్నారు. భూముల రీసర్వేలో రెవెన్యూ, సర్వే ల్యాండ్ అధికారులు నేరుగా రైతుల వద్దకే వెళ్లి వివరాలు సేకరించి రికార్డులు పరిశీలించి నివేదికలు తయారు చేయాలన్నారు. విలేజ్ బౌండరీ, గ్రౌండ్ బౌండరీ తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, సర్వే ల్యాండ్ అధికారి మురళీకృష్ణ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధులు రూ.37.86 కోట్లు మంజూరు

కడప రూరల్, ఫిబ్రవరి 19: పిఎం కిసాన్ కింద జిల్లాకు 1.89 లక్షల మంది లబ్ధిదారులకు గాను రూ.37.86 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులు గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు మూడవ విడత కింద పిఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి రైతు ఖాతాకు ఒక్కొక్కరికి రూ.2000లు చొప్పున ఈ నెల 24వ తేదీ సోమవారం జమకానుంది. పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 18 విడతల్లో లబ్ధిదారులకు లబ్ధి చేకూరింది.

ఎదురుచూపులు ఎన్నాళ్లు..?

పులివెందుల నియోజకవర్గంలో 602 మంది రైతులు సబ్సిడీ పీవీసీ పైపుల కోసం ఎదురుచూస్తున్నారు. పాడా కింద 50శాతం సబ్సిడీతో పైపులు అందిస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. 16నెలల క్రితం డీడీలు తీసిన రైతులు పైపుల కోసం ఇంకా ఎదురుచూస్తున్నారు. పైపులు ఇవ్వకపోతే కనీసం డీడీలు వెనక్కు ఇవ్వాలని రైతులు అంటున్నారు. అయినా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

- సబ్సిడీ పైపుల కోసం డీడీలు తీసి 16నెలలు
- ఇప్పటికీ పైపులు ఇవ్వని అధికారులు
- డీడీలు వెనక్కి ఇవ్వండి అంటూ రైతుల వేడుకోలు



సబ్సిడీపై రైతులకు అందిస్తున్న పీవీసీ పైపులు (ఫైల్)

పులివెందుల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని ఏడు మండలాల రైతులకు 50శాతం సబ్సిడీపై పాడా ద్వారా పైపులు అందిస్తామని అప్పటి ప్రభుత్వం తెలిపింది. దీనితో రైతులు పెద్దఎత్తున సబ్సిడీ పైపుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రధాన కాల్వల్లో కృష్ణాజలాలను పంట పొలాలకు అందించేందుకు పైపులు అవసరం. అందువలన రైతులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కో రైతుకు రెండు యూనిట్ల పైపులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. కొంతమంది రైతులు రెండు యూనిట్ల పైపులకు దరఖాస్తు చేసుకున్నారు. ఒక యూనిట్‌కు రూ.10వేల చొప్పున రెండు యూనిట్లకు రూ.20వేల చొప్పున డీడీ తీసి ప్రభుత్వానికి అందించారు. నియోజకవర్గంలో 3,399 మంది రైతులు సబ్సిడీ పైపుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో 2,797 మంది రైతులకు వైసీపీ ప్రభుత్వం ఉండగానే పైపులు అందాయి. 602 మంది రైతులకు మాత్రం పైపులు అందలేదు. ఇంతలో ఎన్నికల కోడ్, ఎన్నికలు రావడంతో ప్రభుత్వం సబ్సిడీ అందించడంలో జాప్యంచేసింది. దీనితో 602 మంది రైతులకు సబ్సిడీ పైపులు అందలేదు. సబ్సిడీ పైపుల కోసం పీవీసీ పైపుల తయారీ సంస్థకు రైతులు చెల్లించిన డీడీల మొత్తం రూ.60లక్షలకు పైగా కంపెనీ వద్ద ఉంది.

ప్రభుత్వం సబ్సిడీ చెల్లిస్తేనే..

పాడా కింద రైతులకు 50శాతం సబ్సిడీపై పీవీసీ పైపులు అందించేందుకు శ్రీకారం చుట్టిన వైసీపీ ప్రభుత్వం.. ఆ కంపెనీకి సబ్సిడీ మొత్తాన్ని చెల్లించలేదు. దాదాపు రూ.2.50కోట్లకు పైనే ప్రభుత్వం పీవీసీ పైపుల తయారీ సంస్థకు చెల్లించాల్సి ఉంది. ఇందులో కొంత మొత్తాన్ని అయినా ప్రభుత్వం విడుదల చేస్తే మిగిలిన రైతులకు కూడా పైపులు సరఫరా చేస్తామని ఆ సంస్థ చెబుతోందని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. పాడా సబ్సిడీ పైపులు అందించే సమయంలో వ్యవసాయ శాఖ ద్వారా దరఖాస్తులను ఆహ్వానించింది. డీడీలు తీసి దరఖాస్తులను వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఇవ్వడంతో ఇప్పుడు రైతులు ఆ శాఖపై ఒత్తిడి పెంచుతున్నారు. డీడీలు వెనక్కి అయినా ఇవ్వండి లేదంటే సబ్సిడీపై పైపులు అయినా అందించండని కోరుతున్నారు. దాదాపు 602 మంది రైతులకు ఈ సబ్సిడీపై పైపులు అందాల్సి ఉంది. ఈ పైపులను అందించేందుకు వ్యవసాయ శాఖ పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించినట్లు తెలిసింది. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కలెక్టర్లకు, స్థానిక ప్రజాప్రతినిదులకు విన్నవించినా స్పందన లేదని ఓ వ్యవసాయశాఖ అధికారి పేర్కొన్నారు. త్వరితగతిన ప్రభుత్వం ఏదొక చర్య తీసుకుంటేనే రైతుల నుంచి ఒత్తిడి తగ్గుతుందని అన్నారు.

తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ



గ్రావెల్ అక్రమ తవ్వకాలకు బ్రేక్

- నాలుగు హిటాచీలు, 10 టిప్పర్లు సీజ్

దువ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం క్రీస్తురాజపురం సమీపంలోని గుట్టల వద్ద నుంచి అనుమతులు లేకుండా సాగుతున్న గ్రావెల్ తవ్వకాలను బుధవారం స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. గ్రావెల్ తరలిస్తున్న 10 టిప్పర్లను, తవ్వకాలు చేస్తున్న నాలుగు హిటాచీలను స్వాధీనం చేసుకున్నట్లు మండల తహశీల్దారు అక్బల్‌బాషా తెలిపారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కూటమి సర్కారులోనూ కొల్లగొడుతున్నారు' అనే కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనానికి స్పందించిన అధికారులు దాడులకు పూనుకున్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, కార్యాలయ సిబ్బంది పోలీసులతో కలిసి అక్రమ తవ్వకాలను నిలిపివేశారు. ఈ ప్రాంతంలో దొరికిన టిప్పర్లన్నింటిని సీజ్ చేశామని ఆర్ఐ జాన్సన్ తెలిపారు. తహశీల్దారు మాట్లాడుతూ గ్రావెల్ అక్రమ తవ్వకాల విషయం తెలియగానే కార్యాలయ సిబ్బందిని పురమాయించామన్నారు. ఈ విషయాన్ని మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న టిప్పర్లను పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా.. గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని బుధవారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ పరిశీలించారు. ఆమె వెంట తహశీల్దారు అక్బల్‌బాషా, జిల్లా మైనింగ్ అధికారి పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ గ్రావెల్ ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంపై అధికారులతో ఆరా తీశారు.



తవ్వకాలు చేపట్టిన ప్రాంతంలో సీజ్ అయిన ఎక్స్‌కవేటర్లు, హిటాచీలు



టిప్పర్లను నిలిపివేసిన అధికారులు

మోడల్ మార్కెట్‌లో.. రూ.కోట్లు వృథా..!



చింతపర్తి మార్కెట్ యార్డు

- శిథిలమవుతున్న భవనాలు
- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ సర్కార్
- కూటమి ప్రభుత్వమైనా దృష్టి సారించాలని రైతుల వేడుకోలు



చింతపర్తి మార్కెట్ యార్డులో మందుబాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు



వాల్మీకిపురం మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న వ్యాపార దుకాణాల సముదాయం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సరిగ్గా 13 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన వ్యవసాయ మార్కెట్ నేడు శిథిలావస్థను తలపిస్తోంది. కోట్ల ప్రజాధనం వృథా కావడంతో పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. వాల్మీకిపురం సమీపంలోని మద్రిపాడు మార్గంలో 2013లో అప్పటి సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.3.40 కోట్ల వ్యయంతో నూతన వ్యవసాయ మార్కెట్ యార్డును ప్రారంభించారు. మంచి సంకల్పంతో రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్‌గా రూపుదిద్దుకోవాలన్న అప్పటి ప్రభుత్వం, పాలకుల ఆశలు నీరుగారాయనే చెప్పాలి. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు, పాలకులు ఏమాత్రం రైతుల సౌకర్యాలు, అవసరాలు గుర్తించకపోవడంతో నేడు మార్కెట్ శిథిలాలను తలపిస్తోంది. వాల్మీకిపురం మార్కెట్ ప్రారంభించిన రోజుల్లో వాల్మీకిపురం, కలకడ మండలాల ప్రాంతాల నుంచి ప్రతినిత్యం సుమారు 150 టన్నుల టమోటాలు మార్కెట్‌కు రావడం, క్రయవిక్రయాలతో సందడి వాతావరణం ఉండేది. కాలక్రమేణా ఇక్కడి మార్కెట్‌లో రైతులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మండల వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాల్లో టమోటా పంట సాగవుతూ నిత్యం రైతులు, వ్యాపారుల సందడితో కళకళలాడే మార్కెట్ నేడు వెలవెలబోతోంది. అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించిన భవనాలు కూడా వృథాగా మారాయి. రైతులు విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు ఉపయోగంలోకి తెచ్చిన పాపాన పోలేదు. యార్డు ఆవరణలో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ కూడా మరుగున పడింది. కనీస సౌకర్యాలు, పర్యవేక్షణ లేకనే రైతులు వాల్మీకిపురం మార్కెట్‌కు రావడం లేదన్న వాదన గట్టిగా వినిపిస్తుండటం గమనార్హం. ఎటువంటి రక్షణ లేకపోవడంతో మార్కెట్ యార్డు మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోతున్నాయి.

అలాగే మండలంలోని చింతపర్తి గ్రామంలో గల మార్కెట్ యార్డు కూడా దుస్థితికి చేరుకుంది. రైతుల ఉపయోగం ఎలా ఉన్నా ఎవరికి తోచిన రీతిలో వారు వాడుకుంటున్నారు. మార్కెట్ కార్యాలయ భవనాలు కూడా అక్రమ నిల్వల గోదాముగా మారిపోవడం గమనార్హం. ఎటు చూసినా మందుబాబుల ఆగడాలతో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. రూ.1.57 కోట్లతో నిర్మించిన మార్కెట్ యార్డు ప్రస్తుతం ఎటూ కాకుండా నిరుపయోగంగా మారింది. గత వైసీపీ పాలనలో వ్యవసాయ మార్కెట్లను పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వమైనా వ్యవసాయ మార్కెట్ యార్డులపై దృష్టి సారించాలని కోరుకుంటున్నారు. చింతపర్తి మార్కెట్ ఎంతో అనుకూలంగా ఉండేదని, ప్రస్తుతం కలకడ మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తోందని సమీప గ్రామాల రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ల తీరుతో మండీల యజమానులు కూడా తాము వ్యాపారాలు కోల్పోయి ప్రతినెలా చేతి నుంచి బాడుగలు కట్టే పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపిస్తుండటం గమనార్హం. వాల్మీకిపురం యార్డు ఆవరణలో 8 వ్యాపార దుకాణ సముదాయాలు ఉన్నప్పటికీ ఏళ్లకాలంగా తెరచుకోకపోవడం వ్యాపారాలు కొనసాగకపోవడం బాధాకరం. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం చొరవ చూపి మార్కెట్ యార్డుల సముదాయాలలో సౌకర్యాల కల్పన, పూర్వ వైభవం తీసుకురావాలని రైతులు కోరుకుంటున్నారు. ఈ విషయమై మార్కెట్ కమిటీ సెక్రటరీ కుమార్‌రెడ్డిని వివరణ కోరగా.. రైతులు మార్కెట్‌కు రాకపోవడం కారణంగా ఈ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పడం కొసమెరుపు.

మార్కెట్ లేక ఇబ్బందులు



చింతపర్తి వ్యవసాయ మార్కెట్ లేకపోవడంతో కలకడ, కలికిరి, మదనపల్లె ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అంతకు మించి పండించిన టమోటా పంట రవాణా ఖర్చులు కూడా భారంగా మారుతున్నాయి. ప్రభుత్వం చింతపర్తి మార్కెట్ యార్డును తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- ఎన్.ఆనంద్, రైతు, పెరుమల్లయ్యగారిపల్లె, వాల్మీకిపురం

రైతుల గోడు పట్టించుకోవాలి



మా గ్రామానికి 5 కి.మీ. దూరంలో ఉన్న మార్కెట్‌యార్డు మూతపడడంతో 25 కి.మీ. దూరంలో కలకడ మార్కెట్‌కు టమోటాలను రవాణా చేయాల్సి వస్తోంది. గడ్డు పరిస్థితులలో సైతం రైతులు తీవ్రంగా నష్టపోయిన సమయాన రవాణా ఖర్చుల భారం, పంటల నష్టం కోలుకుండా చేస్తోంది. అదే మా గ్రామ సమీపంలో ఉన్న చింతపర్తి మార్కెట్‌లో ప్రభుత్వం చొరవ చూపి బాగు చేసినట్లయితే సమీప గ్రామ రైతులందరికీ ఎంతో మేలు కలుగుతోంది. పాలకులు, రైతులు కూడా రైతుల సమస్యలు, ఇబ్బందులను గుర్తించాల్సిన అసరవం ఎంతైనా ఉంది.

-జయచంద్రనాయుడు, రైతు, శాకంవారిపల్లె, వాల్మీకిపురం

ఇష్టారాజ్యంగా నిధుల దుర్వినియోగం

చిన్నగొల్లపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

సుండుపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న గొల్లపల్లి పంచాయతీ నిధులు దుర్వినియోగమయ్యాయంటూ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి శివశంకరయ్య గత డిసెంబరు లో కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో అధికారులు అదే నెలలో విచారణ చేశారు. రూ. 1,13,100 సాధారణ నిధులు, రూ. 2,63,125 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగమైనట్లు విచారణలో తేల్చారు. దీంతో చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేస్తూ డీపీవో మస్తాన్‌వలి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు బుధవారం తెలిపారు. క్షేత్రస్థాయిలో విచారణ చేస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని ఫిర్యాదుదారు రెడ్డిచర్ల శివశంకరయ్య ఆరోపిస్తున్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం

రామసముద్రం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసీపల్లెలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అయితే వారు వచ్చేలోపే గడ్డివాములకు మంటలు పూర్తిగా వ్యాపించాయి. సిబ్బంది మంటలార్పడానికి ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గ్రామానికి చెందిన ఆర్.చెంగారెడ్డి, పి.చంద్రప్పకు చెందిన గడ్డి వాములకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.60 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకుకు గాయాలు

రామాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ వెంకటసుధాకర్ రెడ్డి కథనం మేరకు రాయచోటి పట్టణానికి చెందిన తిరుపతి చంద్ర తన కుమారుడు సాయికుమార్‌తో కలసి బైక్‌పై రామాపురం మండలం రాచపల్లి పంచాయతీ వడ్డెపల్లెకు వెళ్లి వస్తుండగా, చిట్లూరు హరిజనవాడ సమీపంలో కుక్కను తప్పించే యత్నంలో బైక్ అదుపు తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని 108 వాహనంలో క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నలుగురికి జైలుశిక్ష

కలకడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో నిందితులైన నలుగురికి వాల్మీకిపురం కోర్టు జరిమానా, జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు బుధవారం పేర్కొన్నారు. ఆయా కేసుల్లో నిందితులైన నాగేంద్ర, బాలాజి, షాబ్‌జాన్, వెంకటరమణలను బుధవారం వాల్మీకిపురం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.16 వేలు జరిమానా, వారం రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

174 కేజీల గంజాయి స్వాధీనం

- విలువ రూ.17.40 లక్షలు
- చిన్నమండెంకు చెందిన భార్యాభర్తల అరెస్టు

వెంకటాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం నుంచి బెంగళూరుకు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రూ.17.40 లక్షల విలువైన 174 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు... మంగళవారం రాత్రి వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ39వీఏ9012 నెంబరు గల ఆటో పోలీసులను గమనించి వెనక్కు తిప్పుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా గుర్తించిన పోలీసులు ఆటోను వెంబడించి పట్టుకున్నారు. దానిని పరిశీలించగా అందులో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఆటోలో ఉన్న అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం చాకిబండ గ్రామానికి చెందిన మేదరి బాలకృష్ణ, రాజమ్మ దంపతులను అదుపులోకి తీసుకుని విచారించగా శ్రీకాకుళం నుంచి బెంగళూరుకు గంజాయిని తరలిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆటోతో పాటు గంజాయిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అందులో పరిశీలించగా 90 ప్యాకెట్లలో 174 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు సూత్రధారులు పరారయ్యారని పోలీసులు తెలిపారు. గంజాయిని పట్టుకున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ అంజనేయులు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ జి.కృష్ణకాంత్ ప్రత్యేకంగా అభినందించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రార్థన స్థలం విషయంలో వాగ్వాదానికి దిగిన రెండు వర్గాలకు చెందిన వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. లక్కిరెడ్డిపల్లెలోని హైస్కూల్ వెనుక ఉన్న ప్రార్థన స్థలం విషయంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఇరువర్గాలకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వివాదాస్పద స్థలం వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని వివరించారు. ఎవరైన గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమ కట్టడం కూల్చివేత



ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనాన్ని తొలగిస్తున్న దృశ్యం

రాజంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సును బుధవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. రాజంపేట మండలం కూచివారిపల్లెలో వత్తలూరు ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వ భూమిలో అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారని ఫిర్యాదులు అందడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి ఆధ్వర్యంలో విచారణ చేసి, సర్వే నంబరు మార్చి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు , ఈ ప్రాంతంలో దాదాపు రెండు ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఇందులో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సును బుధవారం సబ్‌కలెక్టర్ నిదియాదేవి ఆధ్వర్యంలో తహసీల్దారు పీరుమున్నీ, రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గుర్రంకొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని వేదపండితులు బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామివారి కలాణోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, వెంకీ, వరద, ధనుష్ సిబ్బంది నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి 81 ప్రత్యేక బస్సులు



యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న మదనపల్లె-1 డిపో మేనేజర్ వెంకట్రమణారెడ్డి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం 81 స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు మేనేజర్ మూరే వెంకటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ వన్‌డిపోలో బుధవారం అన్ని యూనియన్ నాయకులతో రూట్ సూపర్‌వైజర్లు గ్యారేజ్ సిబ్బందితో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ మదనపల్లె నుంచి తంబళ్లపల్లె వరకు 20 బస్సులు, తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి కొండ కిందకు 10 సర్వీసులు, కొండ కింద నుంచి తంబళ్లపల్లె మల్లయ్యకొండ పైకి 35 సర్వీసులు నడుపుతున్నట్లు బీఎం పేర్కొన్నారు.

ప్రతి బస్సులో డ్రైవర్‌తో పాటు కండెక్టర్ ఉంటారని తెలిపారు. అలాగే పెద్దమండ్యం-తంబళ్లపల్లె మల్లయ్యకొండకు 2 బస్సులు, బి.కొత్తకోట-తంబళ్లపల్లె మల్లయ్యకొండకు 2, ములకలచెరువు -తంబళ్లపల్లె మల్లయ్యకొండకు 2 బస్సులు నడుపుతున్నామని తెలిపారు. మదనపల్లె వన్ డిపో- అంగళ్లు సమీపంలోని మల్లయ్యకొండకు 10 బస్సులు నడుపుతున్నామన్నారు. ఇదిలా ఉండగా తంబళ్లపల్లె మల్లయ్యకొండ మాజీ అధ్యక్షుడు కనుగొండ మద్దిరెడ్డి ఆధ్వర్యంలో పెద్దమండ్యం, బి.కొత్తకోట, ములకలచెరువు నుంచి మూడు ఉచిత బస్సులను భక్తుల సౌకర్యార్థం నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణారెడ్డి, బాబ్జి, వి.వి. రమణ రెడ్డి, బాషా, శివయ్య, ఎంసీ శేఖర్ చంద్రయ్య, అసిస్టెంట్ మేనేజర్ రేవతి, ఎం.ఎఫ్. రవి, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

గుండాలకోనకు 12 శాశ్వత కాశీ శివలింగాలు



చిట్వేలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాలకోన కర్కటేశ్వర స్వామి సన్నిధికి 12 శాశ్వత పంచామృత కాశీ శివలింగాలు ప్రతిష్ఠించనున్నట్లు గుండాలకోన ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం కాశీ శివలింగాలను పెద్దూరు గ్రామానికి ప్రత్యేక పూజలతో గ్రామోత్సవంగా తీసుకువచ్చారు. అనంతరం రాత్రికి గుండాలకోనకు శివలింగాలను తీసుకెళ్లారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యా! ఏడు నెలలైనా.. మా సమస్యలు పరిష్కరించలేదు

- సిసోడియా ఎదుట గోడు వెల్లబోసుకున్న బాధితులు



రెవెన్యూ స్పెషల్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాకు అర్జీలు అందిస్తున్న ప్రజలు

మదనపల్లెటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అయ్యా.. ఏడు నెలల క్రితం మీరు మదనపల్లెకు వచ్చినపుడు తాము ఇచ్చిన అర్జీలు ఇంత వరకు పరిష్కారం కాలేదని పలువురు అర్జీదారులు రెవెన్యూ స్పెషల్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియాతో మొరపెట్టుకున్నారు. బుధవారం మదనపల్లెకు వచ్చిన సిసోడియాతో పలువురు అర్జీదారులు తమ సమస్యలను ఏకరువు పెట్టుకున్నారు. సిసోడియాకు గతంలో ఇచ్చిన అర్జీలపై కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు పలుసార్లు అర్జీలు ఇచ్చామని, ఇంతవరకు ఆయా మండలాల తహసీల్దార్లు తమ సమస్యలను పరిష్కరించలేదన్నారు. ముఖ్యంగా భూముల వివాదాలు, వన్-బీలో పేర్ల నమోదు, సర్వే సమస్యలపై అధికారులు నాన్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 30 మందికి పైగా ప్రజలు సిసోడియాకు అర్జీలు అందజేశారు. ఈ అర్జీలన్నింటికి టాప్ ప్రియారిటీ ఇచ్చి, విచారించి పరిష్కరించాలని, కోర్టు కేసులుంటే ఎండార్స్‌మెంట్లు ఇవ్వాలని సిసోడియా సబ్‌కలెక్టర్‌కు సూచించారు.

భూములకు పాసుపుస్తకాలు ఇవ్వండి



మా పిత్రార్జితంతో పాటు, నేను కొనుగోలు చేసిన భూములకు పాసుపుస్తకాలు మంజూరు చేయండి. కోర్టులో మాకు అనుకూలంగా తీర్పు వచ్చినా అధికారులు మా ప్రత్యర్థుల పేరిట పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారు. దీనిపై పూర్తిగా విచారించి మాకు న్యాయం చేయండి. ఏడు నెలలుగా నా సమస్య పరిష్కారం కాలేదు.

- రామచంద్రారెడ్డి, వెంగంవారిపల్లె, నిమ్మనపల్లె మండలం.

మా భూములపై ఇతరులకు వన్-బీ ఇచ్చేశారు



మదనపల్లె మండలం బసినికొండ రెవిన్యూ గ్రామం కొండామరిపల్లెలో సర్వే నెంబర్ 431లో తమకు చెందిన భూములకు వన్-బీ మంజూరుకు ఏడు నెలల క్రితం అర్జీ ఇచ్చాము. ఆ భూమికి సంబంధించి వేరే వారికి వన్-బీ మంజూరు చేశారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయండి సార్. ఏడు నెలల నుంచి అన్ని కార్యాలయాలకు తిరుగుతున్నా న్యాయం జరగలేదు.

- ఏ.వెంకటరమణారెడ్డి, కొండామద్రిపల్లె, మదనపల్లె మండలం.

వివాదాల భూమిని డిస్ప్యూట్ రిజిస్టర్‌లో పెట్టండి



కురబలకోట మండలం మట్టివారిపల్లె గ్రామం సర్వే నెంబర్ 630/1లోని 6.69 సెంట్ల భూమిపై వివాదం నడుస్తోంది. పూర్తి విచారణ అయ్యేంత వరకు ఈ భూమిపై ఎవరికి పాసుపుస్తకాలు మంజూరు చేయొద్దు. దీనిపై పలుమార్లు అర్జీలు సమర్పించాను. ఇప్పటికే తహసీల్దార్, సబ్‌కలెక్టర్‌కు ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. దీనిపై విచారించి ఈ భూమి వివరాలను డిస్ప్యూట్ రిజిస్టర్‌లో నమోదు చేయించాలి.

- దావూద్‌ఖాన్, సీటీఎం, మదనపల్లె మండలం.

రోడ్డు రోలర్ కింద పడి వ్యక్తి మృతి



వివరాలు సేకరిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మహేష్

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉండగా మూర్ఛ రావడంతో రోడ్డు రోలర్ డ్రైవర్ తాను నడుపుతున్న వాహనం కిందే పడి మృతి చెందిన హృదయ విదారకమైన సంఘటన మండల పరిధిలోని మంగంపేట పరిధిలో బుధవారం చోటుచేసుకుంది.

రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాల మేరకు కడప జిల్లా సీకె దిన్నె మండలానికి చెందిన కిరణ్‌కుమార్(36) రోడ్డు రోలర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం ఆయన రోడ్డు రోలర్‌తో మండల పరిధిలోని గోవిందంపల్లె - మంగళంపల్లె రోడ్డు మలుపు వద్ద వెళుతుండగా మూర్ఛ రావడంతో అదుపు తప్పి, అదే వాహనం కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

పట్టపగలే చోరీ



ఆనవాళ్లు సేకరిస్తున్న క్లూస్ టీం

సిద్దవటం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిర్మలగిరికాలనీలోని ఓ ఇంట్లో పట్టపగలే జరిగింది. బాధితుడి కథనం మేరకు బుధవారం ఉదయం 10 గంటలకు ఆర్‌ఎంపీ వైద్యుడు వీరభద్రుడు ఇంటికి తాళాలు వేసి మాధవరంలో ఉన్న క్లినిక్‌కు వెళ్లగా, ఆయన భార్య వీరమ్మ బ్యాంకు పనిమీద నందలూరుకు వెళ్లింది. ఉదయం 11 గంటలకు ఇంటికి వెళ్లగా, తలుపులకు ఉన్న తాళాలు తొలగించినట్లు కనిపించడంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, బీరువా పగులగొట్టి అందులోని రూ. 2 లక్షలు నగదు, 30 తులాల బంగారం అపహరించినట్లు తేలింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు, క్రైం సీఐ భాస్కర్‌రెడ్డి, క్లూస్‌టీం సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు బాధితుడు తెలిపాడు.

పొలం పిలుస్తున్నా... రారేమి...!



పొలం పరిశీలనలో వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

- కార్యక్రమంపై అవగాహన భ్రమ
- పత్తాలేని అనుబంధ శాఖల అధికారులు
- మొక్కుబడిగా 'పొలం పిలుస్తోంది'

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులను సాగులో సుశిక్షితులను చేసి సస్యరక్షణలో శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్ది వ్యవసాయం లాభసాటిగా మార్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో వ్యవసాయ శాఖ అధికారులతోపాటు అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని వ్యవసాయాభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది. వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులు గ్రామాల్లోని రైతుల క్షేత్రాలను సందర్శించడంతోపాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వారికి అవసరమైన సమాచారాన్ని అందించాలి. విత్తన ఎంపిక మొదలు ఎరువులు, పురుగులు, తెగుళ్ల, నివారణ మందులు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అన్ని సమస్యలపై నేరుగా చర్చించి అవగాహన కల్పించాలి. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా సాగుతోంది. వ్యవసాయశాఖ అధికారులు మినహా మిగిలినవారు కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ కార్యక్రమం ప్రభుత్వ లక్ష్యానికి దూరం అవుతోంది.

వారానికి నాలుగు గ్రామాలు

ఉమ్మడి కడప జిల్లాలో 66 మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో మంగళ, బుధవారాల్లో రెండు గ్రామాల చొప్పున వారానికి నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పొలాలను పరిశీలించి అభ్యుదయ రైతులను ప్రోత్సహించాల్సి ఉంది. ఉమ్మడి కడప జిల్లాలోని 66 మండలాల్లో ఒక్కో మండలంలో వారానికి నాలుగు గ్రామాల చొప్పున 264 గ్రామాలు, నెలకు దాదాపు 1056 గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

నిర్వహణ సాగాలిలా...

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ లక్ష్యంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు పొలం బాట, పంట సాగుపై చర్చలు జరపాలి. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచార పరిజ్ఞానాన్ని చేరువ చేయాలి. వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించాలి. క్షేత్ర సమస్యలకు తక్షణమే పరిష్కారం సూచించాలి. తక్కువ పెట్టుబడి, అధిక ఉత్పత్తి, ఎక్కువ నికర ఆదాయం దిశగా ప్రోత్సహించాలి.

మిగతావారేరి...

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులతోపాటు అనుబంధ శాఖలైన హార్టికల్చలర్, సిరికల్చలర్, ఫిషరీస్, వెటర్నరీ శాఖ, మార్కెటింగ్ అధికారులు, విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, విద్యుత్తు, జలవనరుల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సి ఉంది. వీరితోపాటు రైతుమిత్ర సంఘాలు, భూసార పరిరక్షణ అధికారులు హాజరై వ్యవసాయ అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలి. ప్రభుత్వ పథకాలు, సంక్షేమం, రాయితీ, సబ్సిడీలను వివరించి రైతుల్లో చైతన్యం పెంచాలి. 2024-25 ఏడాదికి సంబంధించి సెప్టెంబరు 24వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. మొదటి విడత షెడ్యూలు పూర్తయి ప్రస్తుతం రెండో విడత షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రబీ సీజన్ కావడంతో అవగాహన సదస్సులు కొనసాగుతున్నాయి. మొదటి షెడ్యూలులో జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన శాఖ అధికారుల జాడ లేదని రైతులు వాపోతున్నారు.

అనుబంధ శాఖల అధికారులు హాజరుకావాలి

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులతో పాటు అన్ని అనుబంధ శాఖల అధికారులు తప్పని సరిగా హాజరుకావాలి. ఆయా శాఖల పథకాలను తెలియజేసి, రైతుల సమస్యలు పరిష్కరించాలి. అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యేలా చూస్తాం.

– నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



అవగాహన కార్యక్రమానికి హాజరైన కొందరు రైతులు

ముందస్తు సమాచారం లేక వెలవెల

ఏ రోజు ఏ గ్రామంలో కార్యక్రమం జరుగుతుందో గ్రామాల్లో ముందస్తు సమాచారం లేకపోవడంతో రైతులు ఎవరి పనుల్లో వారు ఉంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు వారి షెడ్యూళ్ల ప్రకారం గ్రామాలకు వెళ్లి అటుగా వచ్చి వెళ్లే రైతులను కూర్చోబెట్టి కార్యక్రమాన్ని మమ అనిపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విత్తు నుంచి ఉత్పత్తి వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చాలా మందికి అవగాహన భ్రమగానే మారిందని విమర్శలు ఉన్నాయి.

పొలతలలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమూర్

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పొలతలలో జరిగే ఉత్సవాలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమా ర్‌లు తెలిపారు. పొలతల క్షేత్రంలోని పరిపాలన భవనంలో కలెక్టర్, ఎస్పీలు వివిధ శాఖల జిల్లా అధికారులతో బుధవారం సమీక్ష నిర్వ హించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు తాగునీరు, అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా, నిరంతరం వైద్య శిబిరాలు, 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడా లన్నారు. భక్తులకు కోసం బస్సులు నడపాలని, మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలని, కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రోడ్ల మర మ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. క్యూలైన్లు, సీసీ కెమెరాలు, సూచిక బోర్డులు, డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రథోత్సవం సమయంలో గట్టి పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. ముందుగా మల్లేశ్వర స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, ఈఈ కృష్ణానాయక్, జెడ్పీ సీఈఓ ఓబు లమ్మ, డీఎంహెచ్ఓ నాగరాజు, డీపీవో రాజ్యలక్ష్మి, ఆలయ పెద్దలు రాజారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

మొల్లసాహితీ పురస్కార ప్రదానం



మలయవాసిని వితలరావు దంపతులు, ఆచార్య విజయలక్ష్మికి పురస్కారం ప్రదానం చేస్తున్న గానుగపెంట

కడప కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్టణంకు చెందిన విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య కోలవెన్ను మలయవాసిని వితలరావు దంపతులకు, హైదరాబాదు సెంట్రల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసరు ఆచార్య విజయలక్ష్మికి మొల్ల సాహితీ పురస్కారాలను అందించారు. బుధవారం స్థానిక కవయిత్రి మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో వారిని సత్కరించి నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఆచార్య మలయవాసిని మొల్ల రామాయణానికి పరిమళం అనే పేరుతో 435 పేజీలతో విశేష వ్యాఖ్యానం రాసి తెలుగు జాతికి మహత్తర కానుకగా అందించారు. ఈ గ్రంథాన్ని టీటీడీ వారు ముద్రించారు. కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ మహా కవయిత్రి పేరుతో సాహిత్య పీఠాన్ని నెలకొల్పి.. రెండు దశాబ్ధాలకు పైగా ఆమె జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్న విద్వాన్ గానుగపెంట హనుమంత రావు అభినందనీయుడన్నారు. మొల్ల సాహిత్యపీఠం కార్యాలయంలో నిక్షిప్తం చేసిన గ్రంథాలయాన్ని, జ్ఞాపికలను, ప్రాచీన తాళపత్ర గ్రంథాలను పరిశీలించి ప్రశంసించారు. తాను రాసిన మొల్ల రామాయణ పరిమళ వ్యాఖ్యను సాహిత్యపీఠానికి అందజేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలి



మాట్లాడుతున్న జేడీఏ నాగేశ్వరరావు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పకృతి వ్యవ సాయంపై రైతుల్లో అవగాహ న పెంపొందించి, ఔత్సాహిక రైతులకు వనరులను సమకూర్చాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో రాష్ట్ర వ్యసాయశాఖ, రైతు సాధికారసంస్థ సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) జిల్లాలో అమలు తీరు, విస్తరణపై వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయసాగుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో వైఎస్సార్ జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిర్ధేశించిన లక్ష్యం మేరకు ఆయా గ్రామాల రైతుసేవా కేంద్రాల పరిధిలోని విలేజ్ అగ్రికల్చర్ సహాయకుల, వ్యసాయాధికారులు, హార్టికల్చర్ సహాయకులు అధికారులు బాధ్యత వహించాలన్నారు. సంప్రదాయ వ్యవసాయసాగు పద్ధతులను అమలు చేసేందుకు గ్రామాలను యూనిట్‌గా తీసుకొని వీవోలు, స్వయం సహాయక సంఘాల సభ్యులను ఈప్రక్రియలో భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలో స్థలం అనుకూలత ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో లేదా పాఠశాలల్లో న్యూట్రీన్ గార్డెన్స్ ఏర్పాటుకు మ్యాపింగ్ చేయాలన్నారు. బయో డైవర్సిటీ విధానం ద్వారా అన్ని రకాల పంటలను పండించేలా రైతులను, యువతను ప్రోత్సహించాలన్నారు.

ఆటో బోల్తా - వ్యక్తి మృతి

దువ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం గుడిపాడు సమీపంలో మంగళవారం ఆటో బోల్తాపడి గాయపడిన ముత్యాలపాడు మునెయ్య (37) బుధవారం కర్నూలులోని ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. సంఘటనలో అతని భార్య, ముగ్గురు పిల్లలకు స్వల్పగాయాలైనట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మహిళ ఆత్మహత్య

దువ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం పెద్దజొన్నవరం గ్రామానికి చెందిన ఆవుల సురేఖ అనే మహిళ బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ వివరాల మేరకు.. భర్త శ్రీనివాసులతో మనస్పర్థలు ఉండడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఉరి వేసుకుని...

కడప క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామక్రిష్ణనగర్‌కు చెందిన ఉరి వేసుకుని చిన్నముజాహ్నవి (15) ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. చిన్నముజాహ్నవి పదోతరగతి వరకు చదివి ఇంటి వద్ద ఉంటోంది. కుటుంబ సమస్యల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

కాశినాయన ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్ పేర్కొన్నారు. మంగళవారం ఆమె నర్సాపురం తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో కాశినాయన మండలం చాలా వెనుకబడి ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే ఉంటే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. తహసీల్దారు వెంకటసుబ్బయ్య, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన వాటికి పరిష్కార మార్గాలు చూపాలని జేసీ అతిధిసింగ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాల యాన్ని విడిట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె రెవెన్యూ సదస్సుల్లో స్పందనలో వచ్చిన అర్జీల గురించి విచారించారు. వీలైనంత త్వరగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించి కార్యాలయాల చుట్టూ తిరగకుండా పరిష్కారమార్గాలు చూపాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రమోహన్, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏడేళ్లుగా వేతనాల పెంపులేదు.. జీవనం ఎలా?




డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ట్రిపుల్‌ఐటీ తాత్కాలిక అధ్యాపకులు

వేంపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల క్రితం రూ.25వేల వేతనంతో చేరాం.. అప్పటి నుంచి ఇప్పటి వరకు వేతనాలు పెంచలేదు.. ఇలాగే కొనసాగితే మేము ఎలా జీవనం సాగించాలంటూ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పనిచేసే తాత్కాలిక అధ్యాపకుల అసోసియేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం డైరెక్టర్ కుమారస్వామి గుప్తకు వినతి పత్రం అందించారు. 110జీఓ ప్రకారం రూ.33వేల వేతనం ఇవ్వాలని కోరారు. వచ్చే నెల నుంచి అమలయ్యేలా చూడాలని, సమస్యను రిజిస్ట్రార్, వీసీల దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. సమస్యను ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డైరెక్టర్ తాత్కాలిక అధ్యాపకు లకు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

క్రీడల ద్వారా శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం పేరు ప్రఖ్యాతలు లభిస్తాయని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమా రస్వామి గుప్త తెలిపారు. క్యాంపస్ ఆవర ణలో ట్రిపుల్‌ఐటీ స్పోర్ట్స్ మీట్‌ను బుధవారం ప్రారంభించారు. వివిధ రకాల ఆటలపోటీలు క్యాంప స్‌లో నిర్వహిస్తున్నామని ప్రతి విద్యార్థి క్రీడల్లో గెలుపోటములను సహజంగా తీసు కొని ముందుకు సాగాలని డైరెక్టర్ తెలిపారు. ఏఓ రవికుమార్, డీన్ రమేష్, కోఆర్డినేటర్ వెంకటేష్, పీడీలు శంషాద్‌బేగం, రమణారెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంపై అన్నదమ్ముల మధ్య ఘర్షణ



గాయపడిన సుబ్బయ్య, శ్రీనివాసులు

కాశినాయన ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లెలో భూ సమస్యపై అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో రెండు కుటుంబాల వారికి రక్తగాయాలయ్యాయి. ఎస్ఐ హనుమంతు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోడెపాటి శ్రీనివాసులు, సుబ్బయ్య ఇరువురు అన్నదమ్ములు. వీరి మధ్య గత కొన్ని సంవత్సరాలుగా భూవివాదం నడుస్తోంది. ఈస్థలంలో మంగళవారం శ్రీనివాసులు గోకులం షెడ్డు నిర్మించేందుకు యత్నించాడు. సుబ్బయ్య అడ్డుకోవడంతో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు కర్రలతో రాళ్ళతో దాడి చేసుకున్నారు. ఈసం ఘటనలో శ్రీనివాసులకు, సుబ్బయ్యకు కొంతమందికి రక్తగాయాలయ్యాయి. ఇరువురి ఫిర్యాదు మేరకు రెండు కుటుంబాల వారిపై కేసు నమోదు చేశామన్నారు.

వైభవంగా ముగిసిన శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు



పులివెందుల రూరల్, ఫిబ్రవరి 19: పులివెందులలో ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమైన శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బ్రహోత్స వాలలో భాగంగా ప్రతి రోజూ స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. చివరి రోజైన బుధవారం హంస వాహనం పై శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివా రిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ చింతకుంట సుధీ కర్‌రెడ్డి, ఈవో కొట్టే వెంకటరమణ పర్యవేక్షణలో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు రోహిత్



కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచిలో 22 నుంచి 26 వరకు జరగనున్న జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కడపలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీకాలేజీ విద్యార్థి రెడ్డి రోహిత్ కుమార్ ఎంపికయ్యారు. 2024 అక్టోబ రులో నంద్యాల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రెడ్డి రోహిత్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఆ విద్యార్థి ఎంపిక పట్ల సం బంధిత కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి హర్షం వెలిబుచ్చారు.

నేడు జిల్లాకు మాల కార్పొరేషన్ చైర్మన్ రాక

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌కుమార్ బుధవారం రాత్రి కడపకు రానున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

బుధవారం అనంతపురం జిల్లాలో పర్యటన కార్యక్రమాన్ని ముగించుకొని రాత్రికి కడప ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. గురువారం ఉదయం 10 నుంచి 11 వరకు ఎస్సీ నాయకులతో ముఖాముఖి నిర్వహిస్తారు. 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహిస్తారు. అదే సమయంలో కలెక్టర్‌తో సమావేశం అవుతారు. మధ్యాహ్నం 3.30 నుంచి 4గంటల వరకు ప్రెస్ మీట్ నిర్వహిస్తారని ఈడీ తెలిపారు.

ప్రజల రక్షణే పోలీసు కర్తవ్యం : ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

సికెదిన్నె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణే పోలీసు కర్తవ్యంగా విధులు నిర్వహించాలని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు సత్వరమే న్యాయం అందించేలా ప్రజలు నిర్భయంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి వారి సమస్యలు చెప్పుకునేలా ప్రజలతో సఖ్యతగా ఉండాలని రోడ్లపై ట్రాఫిక్ అడ్డంగా వాహనాలు పెట్టకుండా చూడాలని సూచించారు. ప్రజలకు పోలీసు విధానంపై నమ్మకం పెంచేలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. మహాశివరాత్రి సందర్భంగా పొలతలకు వెళ్లే భక్తులకు సమస్యలు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పొలతల పుణ్యక్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారని, వారికి ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని, వాహనాలను తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసుకుని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్, ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది, పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం మెరుగుపరచడమే లక్ష్యం

ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో అభ్యసన సామర్థ్యం మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేయాలని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి అంగన్వాడీలకు సూచించారు. బుధవారం అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పులివెందుల సీడీపీఓ శ్రీలత ఆధ్వర్యంలో అంగన్వాడీలకు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణలో ఆమె మాట్లాడుతూ ఎన్ఈపీ-2020 పాలసీ విధానంలో 3 నుంచి 18ఏళ్ల పిల్లలకు నాణ్యమైన విద్యనందించడం కోసం సపోర్టివ్ ఆంధ్రాస్ లర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) అనే కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు. పాత విద్యా విధానం, కొత్త విద్యా విధానం గురించి వివరించారు. కొత్త విద్యా విధానంలోని ప్రతి అంశాన్ని శిక్షణలో తెలలియజేస్తామన్నారు. 28రోజులు ఆన్‌లైన్‌లో, 12 రోజులు ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల సామర్థ్యాన్ని తెలుసుకుని వారికనుగుణంగా విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. ఎంఈఓ రామానాయుడు ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాబున్నీ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలు భవిష్యత్తును అందిస్తాయి


శిక్షణనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఈఓ లిల్లెమ్మ

వల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలు పిల్లలకు భవిష్యత్తును అందిస్తాయని ఎంఈఓలు లిల్లెమ్మ, విజయారెడ్డి అన్నారు. స్థానిక గంగాయపల్లె మాడల్ స్కూలులో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణను బుధవారం ఎంఈఓలు పరిశీలించారు. శిక్షణ పొందుతున్న అంగన్వాడీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ కేంద్రానికి వచ్చే పిల్లలకు విషయాలు క్లుప్తంగా తెలిపా వారి భవిష్యత్తుకు బాట వేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారాలు, చిన్న చిన్న కథలు, చిన్న చిన్న ఆటలను ఆడించాలన్నారు. దీంతో వారికి చదువుకోవాలనే జిజ్ఞాస ఏర్పడుతుందన్నారు. ఆధునిక రంగంలో పిల్లలను ఎలా దగ్గరకు తీసుకోవాలన్న అంశాన్ని ఇక్కడ శిక్షణ తీసుకున్న తరువాత తాము కూడా ప్రణాళికలు రూపొందించుకుని అదే విధంగా వారిని అభివృద్ధి చెందించాలన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణ 120 రోజులు కోర్సును ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఈ అధీకృత కృత్యాలపై పిల్లలకు అవగాహన పరచాలన్నారు. శిక్షణలో మంచి మెళకువలు నేర్చుకుని తద్వారా అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్పీలు శివ కుమార్‌రాజు, చిన్నరెడ్డయ్య, విద్యావతి, ఎంఈఓఆఫీసు సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనం చెల్లింపు సంతోష దాయకం


విలేకరులతో మాట్లాడుతున్న జిలాని బాష

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇమామ్, మౌజన్‌ల పెండింగ్ గౌరవ వేతనాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెల్లించడం సంతోషమని టీడీపీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు జిలానీ బాష, కడప నగర మైనార్టీ అధ్యక్షుడు ఖాజాపీర్ పేర్కొన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీలకు పెద్దపీట వేసిన ఘనత ఒక్క టీడీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటిగా ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు ఇచ్చి, మసీదుల అభివృద్ధికి, మైనార్టీల సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. టీడీపీ నేత అస్లాం తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రకృతి వ్యవసాయ స్టాల్

చక్రాయపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో ప్రకృతి వ్యవసాయం స్టాల్‌ను ప్రారంభించారు. కూరగాయలు, ఆకుకూరలు, గడ్డ, తీగజాతి అన్ని రకాల నిత్యావసరంలో ప్రతి కుటుంబానికి ఉపయోగపడే వస్తువులను ప్రదర్శించారు. ప్రతి బుధవారం అందుబాటులో ఉంటాయని ప్రజలు ఆరోగ్యకరమైన జీవనం సాగించేందుకు ప్రకృతి వ్యవసాయ పంటలను ఉపయోగించాలన్నారు.

ఆద్యంతం గందరగోళం

సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలో గందరగోళం ● ఏర్పాట్లలో మున్సిపల్, మెప్మా అధికారుల నిర్లక్ష్యం


పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో గుంపులుగా అభ్యర్థులు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూల్లో అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. పులివెందుల మున్సిపాలిటీకి సంబంధించి 49 యూనిట్లు మంజూరు కాగా ఆన్‌లైన్ ద్వారా 604 మంది దరఖాస్తు చేసుకోగా 530 మంది హాజరయ్యారు. వీరంతా ఉదయం 10గంటలకే మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. బ్యాంకు అధికారులు రాకపోవడంతో గుంపులు గుంపులుగా ఉండిపోయారు. ఏర్పాట్లు చేయాల్సిన మున్సిపల్, మెప్మా అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కాస్త ఆలస్యంగా వచ్చిన బ్యాంకు అధికారులను అభ్యర్థులు చుట్టుముట్టారు. బ్యాంకు అధికారి వద్ద కనీసం బోర్డు కూడా పెట్టకపోవడంతో అప్లికేషన్ ఇవ్వాల్సిన బ్యాంకు అధికారి ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఒక బ్యాంకుకు ఇవ్వాల్సిన దరఖాస్తులను మరో బ్యాంకు ఇచ్చిన పరిస్థితి ఎదురైంది. ఇదిలా ఉంటే అభ్యర్థులకు కనీసం తాగునీటి సౌకర్యం, ఫ్యాన్లు కూడా వేయకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఒక్కో బ్యాంకుకు ఒక్కో గది కేటాయించి ఇంటర్వ్యూలు ప్రశాంతంగా జరిగేలా చూశారు. మండలంలో మొత్తం 15 యూనిట్లు మంజూరు కాగా 124 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 60 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి తెలిపారు.

30 యూనిట్లకు 252 మంది...

సింహాద్రిపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బ్యాంక్ మేనేజర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు జరిగాయి. మండలానికి 30 యూనిట్లు మంజూరవగా 353 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 252 మంది హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు. ఏఓ శ్రీనివాసరెడ్డి, ఈఓ పీఆర్డీ పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో 85 మంది....

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో బుధవారం జరిగిన ఇంటర్వ్యూలకు 85 మంది హాజరైనట్లు మున్సిపల్ కమిషనరు పి.జగన్నాధం తెలిపారు. మొత్తం 125 మంది దరఖాస్తు చేసుకోగా 85 మంది హాజరయ్యారు.

వీరపునాయునిపల్లెలో...

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు జరిగాయి. మండలానికి 23 యూనిట్లు మంజూరు కాగా 290 మది అభ్యర్థులు హాజరైనట్లు ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ తెలిపారు.

విశిష్టసంఖ్య కోసం నమోదు చేసుకోవాలి

చెన్నూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వ పరంగా అందే సబ్సిడీలను పొందేందుకు సమీప రైతు సేవాకేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేయించుకుని 14అంకెలు గల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని మండల వ్యవసాయాధికారి శ్రీదేవి అన్నారు. చెన్నూరు సహా కొండపేట, కనుపర్తి రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం రైతులకు ప్రభుత్వమందించే సబ్సిడీలపై అవగాహన కల్పిస్తూ ఇందుకోసం విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుతో కలిగే ఉపయోగాలు వివరించారు. సచివాలయ వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి

ముఖ్యమంత్రికి మాజీ డిప్యూటీ సీఎం లేఖ

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాష కోరారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాసిన ఆయన మాట్లాడుతూ ఏపీజీబీ రైతులకు, మధ్యతరగతి ఖాతాదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. కరువుపీడిత, వెనుకబడిన ప్రాంతమైన కడపలో బ్యాంకు ఉనికి ప్రాంతీయ అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. అన్ని రంగాల్లో ముందస్తులో ఉండడం, ఎక్కువ టర్నోవర్ ఉండడంతో కడప మరియాపురంలో 2015లో రూ.15కోట్లతో అన్ని సౌకర్యాలతో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయాలన్నింటినీ ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని, విలీనం తర్వాత ఏర్పడబోయే రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేయాలని కోరారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన తప్పనిసరి

చెన్నూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని లేకపోతే తీవ్రంగా నష్టపోతారని కెనరా బ్యాంకు విశ్రాంత సీనియర్ మేనేజరు ఎల్.క్రిష్టారెడ్డి అన్నారు. దౌలతాపురంలో గురువారం పొదుపు సంఘాల మహిళలకు ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో ఆర్థిక నేరాలు ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కెనరా బ్యాంకు ఎఫ్ఎల్‌సీ వీరప్రసాద్ మాట్లాడుతూ అపరిచిత ఫోను కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం సైబర్ క్రైం నివారణపై కళాజాత నిర్వహించారు కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, హెడ్స్‌సంస్థ అధ్యక్షుడు క్రిష్ణయ్య యాదవ్ పాల్గొన్నారు.

మంచి వ్యాపారులుగా పేరు తెచ్చుకోవాలి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మంచి బంగారు నగల వ్యాపారులుగా వినియోగదారుల నుంచి పేరు సంపాదించుకోవాలని కడప జ్యువెలరీ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి (బంగారు రాజా) గౌరవాధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్ సూచించారు. బుధవారం బీకేఎం స్ట్రీట్‌లోని కడప జ్యువెలరీ అసోసియేషన్ కార్యాలయంలో నూతన కార్యవర్గ ఎన్నికలో వారు మాట్లాడుతూ ఐకమత్యంతో ఏ పని అయినా సాధించుకోగలమన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఆకుల రాజమోహన్, ట్రెజరర్‌గా చాంద్‌బాషా, మరో ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు జాయింటు సెక్రటరీలు, మిగతా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పలువురు బంగారు నగల వ్యాపారులు పాల్గొన్నారు.

క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పవన్‌కుమార్ ప్రజలకు సూచించారు. స్థానిక పాతకడప జిల్లా పరిషత్ హైస్కూలులో క్షయ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రం (పాతకడప) వైద్యుడు మాట్లాడుతూ క్షయ మానవాళికి వచ్చే జబ్బుల్లో చాలా భయంకరమైనదన్నారు. ఇవాళ క్షయ పెద్ద ఆరోగ్య సమస్యగా మారిందన్నారు. గాలిలోని తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాధి వ్యాపిస్తుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైద్యసిబ్బంది బి.సుబ్బరాయుడు, ధనుంజయ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సమస్య తెలిస్తేనే పరిష్కారం

చెన్నూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులు వారి ప్రాంతాల్లో భూముల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువస్తేనే సమస్య పరిష్కరించబడి వారికి మేలు జరుగుతుందని తహసీల్దారు సరస్వతి అన్నారు. కొండపేట, బలసింగాయపల్లెలో బుధవారం పలువురు రైతులతో మాట్లాడుతూ ప్రతి రైతు బాగుండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్నోరకాలుగా అవకాశాలు అందిస్తోందన్నారు. ఇప్పటికే పీజీఆర్ఎస్ (స్పందన) రెవెన్యూ సదస్సుల్లో సమస్యలు తెలిపియన్నారని, అధికా రుల వద్దకు ప్రజలు వచ్చి తెలిపే కార్యక్రమని, గ్రామ దర్శిని పేరుతో రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి సమస్యలు అడిగి పరిష్కరిస్తారన్నారు.

రైతు గుర్తింపు కార్డుతో పథకాలు : ఏడీఏ



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతు గుర్తింపు కార్డుతో ప్రభుత్వ పథకాలు సులభంగా పొందవచ్చని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం చిన్నచెప్పలిలో పొలం పిలుస్తోందిలో ఆయన మాట్లాడుతూ రైతు గుర్తింపుసంఖ్య నమోదును ప్రతి రైతు తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. దాని ద్వారా ప్రభుత్వం నుంచి వస్తున్న అన్ని సంక్షేమ పథకాలు సులభంగా పొందవచ్చన్నారు. రైతులు వారి ఆధార్ నెంబరు, ఆధార్ అనుసంధానిత ఫోను నెంబరు, భూమి రికార్డుల వివరాలను తీసుకుని రైతు సేవా కేంద్రంలో రైతు గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ సహాయకురాలు సుప్రియ, రైతులు పాల్గొన్నారు.

పాపాఘ్ని ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు టీడీపీ, బీజేపీ, వీహెచ్‌పీ ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ, బీజేపీ, వీహెచ్‌పీ నేతలు

వేంపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నది ఎద్దలకొండ వద్ద ఆలయానికి ఇబ్బందికరంగా మారిన ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. టీడీపీ దేవస్థాన మాజీ చైర్మన్ ఎద్దల కొండ్రాయుడు, మాజీ గ్రంథాలయ చైర్మన్ బాలస్వామిరెడ్డి, రైతు విభాగ రాష్ట్ర నేత జగన్నాథరెడ్డి, దేవస్థాన మాజీ సభ్యుడు రమణ, నల్లగారి కృష్ణారెడ్డి, బీజేపీ, వీహెచ్‌పీ నేతలు సుష్మ, సుబ్బారెడ్డి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఉత్సవాల సమయంలో కొండముందున్న స్థలం భక్తులకు సౌకర్యంగా ఉంటుందని, అక్కడ కంచె వేశారని, ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుందాం

కడప క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకోవద్దని, ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ప్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి సూచించారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప నగరంలోని ఉక్కాయపల్లె శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం యాంటి డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో ఇన్‌స్పెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ వై.నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులర్ ఉద్యోగుల నియామకం

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీకి ఇద్దరు మున్సిపల్ ఉద్యోగులు ప్రమోషన్ మీద నియమించబడ్డారని కమిషనరు జగన్నాధం తెలిపారు. ఇక్కడ ప్రతి ఉద్యోగి డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని గతంలో ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఇటీవల ప్రభుత్వం పంచాయతీకి 21 పర్మినెంట్ పోస్టులు నియామకానికి అనుమతులు ఇచ్చిందన్నారు. జీవీఎస్ కల్యాణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంటుగా ప్రొద్దుటూరు నుంచి, ఇషాక్‌బాబు జూనియర్ అసిస్టెంటుగా ప్రమోషన్‌పై మైదుకూరు నుంచి బదిలీ అయ్యారన్నారు. కమిషనరు జగన్నాథ్, కమలాపురం ఎమ్మెల్యేను కలిశారు.

'దాడులపై కలెక్టర్ స్పందించాలి'

కడప సెవెన్‌రోడ్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కబ్జాదారుల చెర నుంచి విముక్తి కల్పించి పేదలు పోరాడి గుడిసెలు వేసుకుంటే వాటిని కూల్చి తిరిగి కబ్జాదారులకు కట్టబెట్టాలని చూస్తున్న రెవెన్యూ అధికారుల వైఖరి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య హెచ్చరించారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని అధికార పార్టీ నేతల అక్రమాలకు అడ్డు అదుపులేకుండా పోయిందన్నారు. బాకరాపేట వద్ద పేదల గుడిసెలు తొలగించాలన్న దురుద్దేశంతో జనావాసాల మధ్యలో అంత్యక్రియలు జరిపించారని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, ఎస్.వెంకటశివ, కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

శ్రీరాముని జీవితం అనుసరణీయం

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాముని జీవితం అందరికీ ఆదర్శం, అనుసరణీయం, మార్గదర్శకమని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. అయ్యవారుపల్లె ఎస్సీ కాలనీలో నిర్మించిన రామాలయంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాల, ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శ్రీమహావిష్ణువు దశావతారాల్లో 7వ అవతారం రామావతారం అన్నారు. ఉత్తమ మానవుడు ఎలా ఉండాలో శ్రీరాముడు సమాజానికి చూపించారన్నారు. సదాశివరెడ్డి, స్వామాట్, రామయ్య, ఉత్తన్న, నాగరాజు, రమణ పాల్గొన్నారు.

సంఘాలు ఆడిట్ చేయించాలి

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పరస్పర సహాయ సహకార సంఘాలు, ప్రత్యేకంగా నమోదు చేయించుకున్న మ్యాక్స్ సంఘాలు ఆడిట్ చేయించాలని జిల్లా సహకార శాఖ అధికారి జె.సురేష్ పేర్కొన్నారు. 2023-24కు సంబంధించి తమ సంఘాల ఆర్థిక లావాదేవీలను ఆడిట్ చేయించాలని, ఆడిట్ నివేదికలను సర్వసభ్య సమావేశాల్లో ఆదమోపరిచి 30రోజుల్లో తమ కార్యాలయానికి అందించాలని ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

వేంపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు చల్లా బాలాజి, కోశాధికారి నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. ఈనెల 24వ తేదీన కడపలో కలెక్టర్ కార్యాలయం వద్ద చేయనున్న ధర్నాను విజయంతం చేసేందుకు కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. బుధవారం వేంపల్లెలో ధర్నా కరపత్రాలు విడుదల చేశారు.

ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన

కడప క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాలతో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు రాకుండా ట్రాఫిక్ విధుల్లో ఉండే హోంగార్డు సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు హోంగార్డు మొబిలైజేషన్‌లో భాగంగా స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం ట్రాఫిక్ సీఐ జావేద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన తరగతులు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని హోంగార్డులు పాల్గొన్నారు.

చీనీకాయలు దొంగతనం

లింగాల, ఫిబ్రవరి 19: వెలిదండ్లలో మంగళవారం రాత్రి చీనీకాయలు దొంగతనం చేస్తుండగా నలుగురు వ్యక్తులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పులివెందుల మెడికల్ కళాశాలలో ఒప్పంద ఉద్యోగి ఒకరు, మైదుకూరు వాసి, మరొకరు కదిరికి చెందిన వ్యక్తి, పులివెందుల వాసి ఒకరు, దొంగతనం చేశారు. వీరిలో ఇద్దరు డిగ్రీ చదువు తుండడం, మరొకరు మైనర్ కావడంతో వీరి భవిష్యత్తు దృష్ట్యా ఎస్ఐ మధుసూదన్ కేసు నమోదు చేయకుండా కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్లబ్‌లలో జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ నరసింహులు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం అర్బన్ సీఐ నరసింహులు పట్టణంలోని క్లబ్‌లను పరిశీలించారు. ఆయన పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలోని క్లబ్, లయోలా డిగ్రీ కళాశాల వెళ్లే దారిలో ఉన్న క్లబ్‌లను పరిశీలించారు. సభ్యులతో మాట్లాడుతూ క్లబ్‌లో జూదం నిర్వహించడానికి అనుమతులు లేవని, ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గొట్లమిట్లలో చైన్ స్నాచింగ్

చక్రాయపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొట్లమిట్లలో బుధవారం చైన్‌స్నాచింగ్ జరిగింది. అంగన్వాడీ టీచర్‌కు లిఫ్ట్ ఇచ్చి చైన్ లాక్కుని వెళ్లినట్లు తెలిసింది. చక్రాయపేటలో ఉన్న అంగన్వాడీ మీటింగ్‌కు వెళ్తుండగా ఘటన జరిగింది.

ఎక్సైజ్ సీఐపై కేసు నమోదు

కడప క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక భాగ్యనగర్ కాలనీ వాసి శ్రీనివాసులరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరిలో ఎక్సైజ్ సీఐగా విధులను నిర్వహిస్తున్న శ్రీనివాసమూర్తిపై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌక్ పోలీసులు తెలిపారు. బాధితుడి నుంచి 2016లో తన ఇంట్లో వారి బంగారు ఆభరణాలను విడిపించుకునేందుకు డబ్బు కావాలని రూ.9లక్షలను అప్పుగా తీసుకున్నాడు. డబ్బు తీసుకున్న సమయంలో కడప ఎక్సైజ్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసేవారు. తరువాత సీఐగా పదోన్నతి రావడంతో మంగళగిరిలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు డబ్బును ఇవ్వకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడప క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విషద్రావణం తాగి చికిత్స పొందుతున్న హుసేన్ బాష(38) మృతి చెందాడు. కడప నగరం ఉక్కాయిపల్లి వాసి హుసేన్ బాష కువైట్‌లో సెల్ ఫోన్ దుకాణంలో పనిచేస్తుండేవాడు. ఆ సమయంలో తొమ్మిది లక్షల నగదు మాయం కావడంతో ఆ డబ్బు కట్టాలని వారు చెప్పడంతో సొంత ఊరికి వచ్చాడు. అది భరించలేక తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల విషద్రావణం తాగాడు అతనికి రిమ్స్‌లో చేర్చి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ఈ మెరిట్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

డీలర్లు రైతులకు మెరుగైన సేవలు అందించాలి

సికెదిన్నె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ డీలర్లు రైతులకు మెరుగైన సేవలు అందించాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధానశాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఇన్‌పుట్ సబ్సిడీ డీలర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇన్‌పుట్‌సబ్సిడీ డీలర్లు ప్రతి ఒక్కరూ వ్యవసాయ డిప్లొమా కోర్సులను పూర్తి చేయాలని, అలాంటివారే మందులు, ఎరువులు అమ్మడానికి కేంద్రం అనుమతి ఇస్తుందన్నారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, కేవీకే ఏరువాక కేంద్రం సమన్వయకర్తలు వీరయ్య, అంకయ్య కుమార్, ఆత్మా పీడీ విజయలక్ష్మి, శాస్త్రవేత్తలు సునీల్ కుమార్, శ్రీవల్లి, భాగవతిప్రియ, మాధురి పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

వేముల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సింగంశెట్టి పద్మావతి (54) హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ కె.కె.కొట్టాల సమీపంలో ఎనుములు మేపుకొంటూ ఉండగా ఆమెను గుర్తుతెలియని వ్యక్తులు దాడి చంపారు. ఆమె తాళిబొట్టు బంగారు గొలుసు, చెవికమ్మలు దొంగిలించారన్నారు. మృతురాలు కూతురు గోగుల దివ్య ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. కేసులో సింగంశెట్టి రమేష్‌ను అరెస్టు చేసి, బంగారు గొలుసు, కమ్మలు స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించామన్నారు.

మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో బుధవారం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి డ్రగ్స్ వద్దు, ఆరోగ్యమే ముద్దు, గంజాయి, మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం అనే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరింపజేశారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొమ్మేపల్లె సూర్యనారాయణరెడ్డి, షబ్బీర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, అర్బన్ సీఐ లింగప్ప, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్డు భూమి స్వాహా..!

ఆక్రమించి అమ్మకం ● పట్టించుకోని అధికారులు

బి.కోడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ ప్రభుత్వం భూగర్భజలాలు పెంచేందుకు ప్రతి గ్రామపంచాయతీలో ఒక గ్రామాన్ని యూనిటు గా తీసుకుని ఆ పరిసరాల్లోని ప్రభుత్వ భూమిలో వాటర్‌షెడ్డు పథకం కింద మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించే వారు. దాని వల్ల వర్షాలు బాగా పడి భూగర్భజలాలు పెంపొందించడంతో రైతులకు ఎంతో ఉపయోగపడే విధంగా వారు అప్పట్లో ఆ పథకాన్ని ఏర్పాటు చేశారు. దాని వల్ల ప్రజలకు చాలా మందికి జీవనోపాధితో పాటు పచ్చదనం ఉట్టిపడేలా ఏర్పాటు చేశారు. అయితే అది తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని నీరుగార్చడమే కాకుండా వాటర్‌షెడ్డు పథకం కింద మొక్కలు నాటిన ప్రభుత్వ భూమిని పూర్తిగా ఆక్రమించేసి ఆ పొలాన్ని అమ్మడం, కంచెలు వేయడం, లక్షలాది రూపాయలు చేతులు మారాయి. అందులో భాగంగా బి.కోడూరు మండలం మేకవారిపల్లె గ్రామ పంచాయతీ అంకన గొడుగునూరు గ్రామ పరిసరాల్లో రెవెన్యూ పొలంలో సర్వే నెం.171లో దాదాపు 40 ఎకరాల్లో భూమిని అప్పటి టీడీపీ ప్రభుత్వంలో వాటర్‌షెడ్డు పథకం కింద మొక్కలు నాటారు. వాటికి నీళ్లు పోసి సంరక్షణ ఇచ్చేందుకు వాచన్‌వార్డుగా ఒకరిని నియమించి వారికి ప్రతి నెలా రూ.4వేల చొప్పున మూడు సంవత్సరాలు జీతం చెల్లించారు. ఆ మొక్కలు ఏపుగా పెరిగా చెట్లు అయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో అదే గ్రామానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు ఆక్రమించి వాటన్నింటినీ యంత్రాల సహాయంతో పెకలించి భూములు తయారు చేసి కొంత మంది ఆక్రమించుకుని, కంచెలు వేస్తే మరికొంత మంది అమ్ముకుని లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకున్నారు. ఈ విషయమై తహసీల్దారు మధునాయక్‌ను వివరణ అడగ్గా, ఆ విషయం తన దృష్టికి రాలేదని, సంబంధిత అధికారిని అడిగి సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.



వాటర్‌షెడ్డు స్థలాన్ని ఆక్రమించి చదును చేసిన దృశ్యం

22వ తేదీనుంచి నీటి నిలుపుదల

కాశినాయన ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): కాశినాయన,కలసపాడు మండలాల మీదుగా వెళ్లే తెలుగంగ ఎడమ కాలువకు ఈనెల 22వ తేదీన నీటిని నిలుపుదల చేస్తున్నట్లు తెలుగంగ ఈఈ క్రిష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈకాలువ కింద ఆరుతడి పంటలు వేసిన రైతులు ఈరెండు మూడు రోజుల్లో పొలాలు తడుపుకోవాలన్నారు.తిరిగి మార్చి 2వ తేదీన నీటిని విడుదల చేస్తామన్నారు.

10లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఎస్పీ పి.భావన పేర్కొన్నారు. బుధవారం రిటైర్డు టీచర్ చిత్రాల శ్రీనివాసులు పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని డీఎస్పీ చేతుల మీదుగా ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలి

ముద్దనూరు ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని డీలర్లకు ఏవో వెంకటకృష్ణారెడ్డి సూచించారు. స్థానిక వ్యవసాయక్షేత్రంలో బుధవారం డీలర్ల సమావేశం నిర్వహించారు.వ్యవసాయశాఖ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ఎరువుల దుకాణా డీలర్లు పాల్గొన్నారు.

బి.కోడూరు తహసీల్దారుగా దస్తగిరయ్య

బి.కోడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బి.కోడూరు నూతన తహసీల్దారుగా యు.దస్తగిరయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దారు మధునాయక్ బాధ్యతలు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నెల్లూరు రోడ్డు గోవిందయ్య స్వామి మఠం సమీపంలో బుధవారం అర్బన్ సీఐ రాజగోపాల్ తనిఖీ నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించి ఇసుకను తరలిస్తుండడంతో 9 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజుకు అప్పగించారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ముద్దనూరు ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు ఖాతాదారులు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ కృష్ణారెడ్డి తెలిపారు.స్థానిక కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం కెనరా బ్యాంకు వద్ద నుంచి పాత బస్టాండు , నాలుగు రోడ్ల కూడలి వరకు బ్యాంకు సిబ్బంది ర్యాలీ నిర్వహించి,బ్యాంకు మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఖాతాదారులకు ఉచిత క్యాన్సర్ చికిత్సలకు సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురానికి ఇంటర్ పరీక్ష కేంద్రం కేటాయింపు

కొండాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చాలా కాలం తర్వాత ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కొండాపురానికి కేటాయించారు. కొండాపురం బాలికల గురుకుల పాఠశాలలో కొండాపురం, ముద్దనూరు మండలాలకు సంబంధించి కేంద్రాన్ని కేటాయించినట్లు ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి తెలిపారు. కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, ముద్దనూరు కళాశాలలకు చెందిన 123 మంది విద్యార్థులు ఈ ఏడాది ఇంటర్ పరీక్షలు రాయనున్నట్లు ఆమె తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌తో పొంచి ఉన్న ప్రమాదం



జమ్మలమడుగు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నాగులకట్ట వీధిలోని చౌడేశ్వరీదేవాలయం ప్రధాన గేటుకు ఎదురుగా రోడ్డు పక్కనే జ్ఞానలింగేశ్వరస్వామి ఆలయానికి ఎదురుగా రోడ్డులో విద్యుత్తు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో సమస్య నెలకొంది. విద్యుత్తు స్తంభానికి పక్కనే ఉన్న భవనం యజమాని ఇంటికి వెనుకభాగంలో ట్రాన్స్‌ఫార్మర్ పక్కగానీ ఏర్పాటు చేసుకోవాలని పై ఆలయాల కమిటీ వారు తెలియజేశారు. శ్రీ చౌడేశ్వరీదేవాలయం, జ్ఞాన లింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి తొట్టిమెరువని, వివిధ కార్యక్రమాలు నిర్వహించినప్పుడు ఆలయాలకు ప్రధాన రోడ్డు కావడంతో ప్రమాదం జరుగుతుందని వాపోయారు. అదే దారిలో స్థానికంగా ఉండే చుట్టుపక్కల రైతులు జొన్నచొప్ప, వరి గడ్డి, వేరుశనగ కట్టె, లోడు వెళ్లాలన్నా ఆ ప్రాంతంలో విద్యుత్తు ప్రమాదం జరిగే అవకాశం ఉందని బుధవారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు సమయంలో స్థానికులు వాగ్వాదానికి దిగారు. ప్రమాదాలు జరుగకముందే పై రెండు ఆలయాలకు ఇబ్బంది కలిగించకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు విషయంలో అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లేపల్లె గ్రామ సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ జాతీయ హైవే రహదారులకు భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మల్లేపల్లె పంచయాతీ పరిధిలో ఉన్న చెంచయ్యగారిపల్లె, శ్రీరామ్‌నగర, లింగాలదిన్నెపల్లె, ఎద్దులాయపల్లె, జొకుపల్లె తదితర గ్రామాల్లో రోడ్డు నిర్మాణాలకు ప్రభుత్వం భూములు తీసుకున్న రైతుల వద్దకు వెళ్లి తమ పొలాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ప్రజాసంఘాల నాయకులు గండి సునీల్, అజయ్, రాహుల్, దేవాశ్రీనివాసులు, గురుబహ్మాచారి, నారాయణ, గురయ్య పాల్గొన్నారు.

ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

చాపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు వారి పొలాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో మ్యాగి కోరారు. భద్రిపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతూకు ఆ సంఖ్యను ఇస్తున్నామన్నారు. ఇందుకు ఆధార్‌కార్డు, భూమి ఎల్‌బీ నంబరు, ఫోన్ నంబరు తీసుకుని ఆయా గ్రామ సచివాలయాల్లో వీఏఏలకు ఇవ్వాలన్నారు. రైతులు సాగు చేసిన వరి పైరును ఆమె పరిశీలించారు.

గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి

ఖాజీపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ మోహన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో దొంగతనాలు జరుగుతాయని, అందుకోసం ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీ

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రోడ్డు నిబంధనలకు లోబడి వాహనాలు నడిపితే ఎలాంటి ప్రమాదాలు సంభవించవని బద్వేలు అర్బన్‌సీఐ రాజగోపాల్ పేర్కొన్నారు. బుధవారం నాలుగు రోడ్ల కూడలిలో పోలీసు సిబ్బందితో కలసి ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల వేంపల్లిరోడ్డులో సబ్‌స్టేషన్ పక్కనున్న వడ్డెర కాలనీలో నూతనంగా నిర్మించినరామాలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణం పూర్తి చేసుకుని బుధవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని పంపిణీచేశారు.

వైభవంగా మారమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కాశినాయన ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి):మండలంలోని బాలాయపల్లె గ్రామంలో మారమ్మ తల్లి విగ్ర ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో బద్వేల్ టీడీపీ సమన్వయకర్త కే.రితేష్‌రెడ్డి,కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.రాజారెడ్డి, బసిరెడ్డి రవీంద్రారెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి,మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కరెంట్ రమణారెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. టీడీపీ నాయకులు డి.క్రిష్ణారెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగికి షోకాజ్ నోటీసు

కొండాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబన్నపేట సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేసే అశ్విన్‌కుమార్‌రెడ్డికి షోకాజ్ నోటీసు జారీచేసినట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. విధుల్లో అలసత్వం వహిస్తూ అక్కడికి వెళ్లే ప్రజలకు సరైనా సమాధానం ఇవ్వ కుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. ఫించన్ కోసం రూ.12,000 లంచం డిమాండ్ చేశాడని గండ్లూరు గ్రామానికి చెందిన రామమునిరెడ్డి ఫిర్యాదు చేశాడు. ఈవిషయమై స్పందనలో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ల పరిశీలనకు పంపినా నోటీసులు ఇవ్వకుండా తిప్పుకున్నాడని కొందరు దివ్యాంగులు ఫిర్యాదు చేశారు. వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. ఈమేరకు అశ్విన్ కుమార్‌రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం భర్త, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని ఖాన్ అహ్మద్ అఫ్సర్‌భాను అనే మహిళ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోరుమామిళ్ల పట్టణంలోని పాత పోస్టాఫీసువీధిలో నివాసం ఉంటున్న ఆమెను భర్త ఫయాజుద్దీన్, అత్త,మామ, మరిది అదనపు కట్నం కోసం ఇబ్బందులకు గురి చేస్తున్నారని బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపినందుకు కేసు నమోదు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్లలో మద్యం తాగి వాహనం నడుపుతున్న డి.నారాయణ అనే వ్యక్తిని అరెస్టుచేసి వాహనం సీజ్ చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.బుధవారం పోరుమామిళ్లలోని చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కాశినాయన మండలం మిద్దెల గ్రామానికి చెందిన బయపు నారాయణ మద్యం తాగి వాహనాన్ని నడపడంతో అతన్నిఅరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా గంగా రెసిడెన్సీ వార్షిక వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి

ఖాజీపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని గంగా రెసిడెన్సీ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో రెసిడెన్సీ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవడం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు రవి, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు జిలానీబాష, రవినాయుడు, బ్రహ్మానాయుడు, ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపకారవేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన సమ్మె ఉధ్రుతంగా మారింది. బుధవారం 17వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో హైక్‌స్టైఫండ్ ఆకారంలో ఎండలో కూర్చొని నిరసన తెలిపారు. 300 మంది విద్యార్థులు స్టైపండ్‌ను పెంచాలి, ప్రభుత్వం వెంటనే స్పందించాలి, విద్యార్థుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ చేసిన నినాదాలతో కళాశాల ఆవరణ ప్రాంగణం మొత్తం మారుమ్రోగింది.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



పోరుమామిళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న మరాఠీలు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ఉత్సవాన్ని పోరుమామిళ్లలో ఘనంగా నిర్వహించారు. బుధవారం పోరుమామిళ్లలోనిఅగ్నిమాపక కేంద్రం వద్ద నుంచి మల్లకతవ వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడి వరకు శోభాయాత్ర నిర్వహించారు. మరాఠా కులస్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: నాలుగురోడ్ల సమీపంలో ఉన్న పెన్షనర్స్ కార్యాలయంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘ అసోసియేషన్ అధ్యక్షుడు గంజికుంటపుల్లయ్య, పెన్షనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, పిచ్చయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పేదల గుడిసెల జోలికి రావడం తగదు

బద్వేలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారులను వదిలేసి పేదల గుడిసెల జోలికి రెవెన్యూ అధికారులు పోలీసు సిబ్బందితో రావడం తగదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ పేర్కొన్నారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. సీపీఐ ఏరియా కార్యదర్శి బాలు, జిల్లా సమితి సభ్యులు పి. వెంకటరమణ, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలు జరిగితే కఠిన చర్యలు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) :ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే సిబ్బందిపై చర్యలు తప్పవని డ్వామా ప్రాజెక్టు డైరెక్టరు ఆదిశేషారెడ్డి తెలిపారు. బుధవారం బ్రహ్మంగారిమఠం మండలం ఉపాధి హామీ స్త్రీశక్తి భవనం ఆవరణంలో ఉపాధి హామీ పనులపై 18వ సామాజిక తనిఖీ కార్యక్రమం చేపట్టారు. స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు నేరుగా గుండుకొడతాం

● ఊకదంపుడు ఉపయోగం లేదు ● ఆ ఇద్దరికీ దెబ్బలు తప్పవు ● ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను బెదిరిస్తున్నారని ఆయనకు నేరుగా గుండుకొడుతామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విమర్శించారు. బుధవారం జమ్మలమడుగులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన హాజరై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి వచ్చేది తన ప్రభుత్వమేనని, అప్పుడు 30 ఏళ్లు ఉంటామని, కలలు కంటున్నారని ఆయనకు కూటమి ప్రభుత్వం నేరుగా గుండుకొట్టడమే తప్ప వేరేది లేదన్నారు. జమ్మలమడుగులో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి గతంలోకానీ, ప్రస్తుతం ఊకదంపుడు స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని అలాంటివి ఉపయోగంలేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తమ కుటుంబంపై వ్యక్తిగతంగా విమర్శలు చేయడం తగదని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం పూర్వోదయ పథకం ద్వారా నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు గుర్తించిందన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో తాను బాధ్యతగా తీసుకుంటానని తెలిపారు. జమ్మలమడుగును అభివృద్ధిలో మొదటి నాలుగు స్థానాల్లో నిలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దేవగుడియాత్ నాగేశ్వరరెడ్డి, నవనీశ్వరరెడ్డి, రమేష్‌రెడ్డి, పుల్లారెడ్డి, ఖాదర్, బాలు, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

● **ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి, పరిరక్షించండి..:** ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సూచించారు. బుధవారం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు రోడ్డు, ముద్దనూరు రోడ్డు, తాడిపత్రి రోడ్డు డివైడర్లలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, కూటమి నాయకులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణారెడ్డి, కొండయ్య, నవనీశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాధవరెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డివైడర్ల మధ్య మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి